# మిగిలింది ఒక్కరోజే

- నేటితో ముగియనున్న ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో క్యాంపెయిన్ జోరు
- ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్
- విజయవంతమైన కేసీఆర్ సభలు



మహబూబ్‌నగర్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



వనపర్తి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, (నమస్తే తెలంగాణ) 27 నవంబర్ : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ ప్రచారంలో ఇతర పార్టీలకు ధీటుగా ముందుకు సాగింది. పకడ్బందీ ప్రణాళికతో అసెంబ్లీ వారీగా ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 నియోజకవర్గాల్లో నిర్వహించిన సీఎం సభలను విజయవంతం చేసుకోవడంతో బీఆర్ఎస్ శ్రేణులకు నూతనోత్సాహాన్నిచ్చింది. ఈనెల 30వ తేదీన గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో నేటి చివరి రోజును ప్రధాన పార్టీలన్నీ ప్రాధాన్యతగా తీసుకుంటున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగింది. ఇతర పార్టీలకంటే ముందుగా బీఆర్ఎస్ అభ్యర్థులను సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ప్రచారాలు కూడా అదే స్థాయిలో ముందు వరుసలోనే నిర్వహించారు. చివరి దశలో ప్రచారాలకు ఆయా పార్టీల నేతలంతా హెలిక్యాప్టర్ల ద్వారా ఉరుకులు.. పరుగులు పెడుతున్నారు. ముందు నుంచి అన్ని నియోజక వర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు పెడతానని ప్రకటించిన సీఎం కేసీఆర్ అనుకున్నట్లుగా సభలను విజయవంతంగా నిర్వహించారు. అనుకున్న దాని కంటే ఎక్కువగా సభలను చేపట్టారు. ఇక కేవలం ఒక రోజు మాత్రమే ప్రచారాలకు అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి నిమిషం కూడా రాజకీయ పార్టీలకు ప్రాధాన్యతగా మారింది.

### అగ్రనేతల దృష్టి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అసెంబ్లీ స్థానాలపై ఆయా పార్టీల అగ్రనేతలు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టితో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను చూపెట్టి 14 సీట్లలోనూ పాగా వేయాలన్న లక్ష్యంతో గులాబీ దళం పట్టుదలతో ఉన్నది. ముందు నుంచి పక్కా ప్రణాళికతో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టిన బీఆర్ఎస్ అభ్యర్థులు అంతే ప్రాధాన్యతతో పల్లెల్లో లీనమయ్యారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాలకు ప్రచారంలో ప్రాధాన్యతనిచ్చారు. అలాగే బీజేపీ నుంచి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మరో ఇద్దరు మంత్రులు నితిన్ గడ్కరీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల తోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కర్నాటక సీఎం సిద్ధిరామయ్య తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ సభలన్నీ సక్సెస్..

ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతమయ్యాయి. మహబూబ్‌నగర్‌తో పాటు జడ్చర్ల, నారాయణపేట, దేవరకద్ర, కల్వకుర్తి, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, వనపర్తి, మక్తల్, గద్వాల, అలంపూర్, మక్తల్ నియోజకవర్గాల పరిధిలో సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభలను నిర్వహించారు. ఈ సభలన్నిటినీ బీఆర్ఎస్ శ్రేణులు పకడ్బందీగా ఏర్పాటు చేసి, ప్రతి కార్యక్రమాన్ని కూడా అనుకున్నదానికంటే ఎక్కువగా సక్సెస్ చేశారు. ప్రతి సభలోనూ ఆయా ప్రాంతాల వారీగా చేపట్టిన అభివృద్ధిని సీఎం కేసీఆర్ వివరించడం, ఇంకా సంక్షేమ పథకాల అమలును సైతం కూలంకషంగా విడమరచడం ద్వారా ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ప్రధానంగా 24గంటల కరెంటు, రైతుబంధు, పింఛన్లు, సాగునీరు తదితర పథకాల అమలు గురించి సీఎం చెప్పినప్పుడు సభికుల నుంచి మంచి రెస్పాన్స్ కనిపించింది. ప్రజలకు సూటిగా అర్థమయ్యేలా సీఎం కేసీఆర్ ప్రసంగాలు ప్రజా ఆశీర్వాద సభల ద్వారా ఆసక్తిని రేకెత్తించాయి. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అగ్రనేతల ప్రసంగాలన్నీ ఇతర భాషల్లో ఉండడం, వాటిని ఇతరులు అనువాదించడం ద్వారా అంతగా ఓటర్లు ఆసక్తిని చూపించలేదు. ఇదిలా ఉండగా, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సైతం ఉమ్మడి జిల్లాలో పలు రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొని ప్రచారాన్ని నిర్వహించారు.

### చతికిలబడిన కాంగ్రెస్..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నిర్వహించిన కాంగ్రెస్ సభలన్నీ అంతంత మాత్రంగానే కొనసాగాయి. చాలా చోట్ల ఖాళీ కుర్చీలతో సభా ప్రాంగణాలు కనిపించడం ద్వారా ప్రచారానికి వచ్చిన నేతలు సైతం గందరగోళానికి గురయ్యారు. అనేక చోట్ల అభ్యర్థుల మార్పు చేయడంవంటి చర్యలతో కాంగ్రెస్ ఉత్సాహం తగ్గిందన్న అభిప్రాయం ఉన్నది. టికెట్లు తెచ్చుకున్న అభ్యర్థులు సమన్వయం చేసుకోవడం లోనూనామమాత్రంగా వ్యవహరించడంతో ప్రచారాలన్నీ ఎడమొఖం, పెడమొఖం అన్న చందానా కొనసాగాయి. ఇక బీజేపీలో కొందరు అగ్రనేతలను ప్రచారాలకు తెచ్చినప్పటికీ ప్రజలు ఆ పార్టీకి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆదరణ అంతంతే అన్న అభిప్రాయం వెలువడుతోంది.

## కాంగ్రెస్‌వన్నీ సొల్లు మాటలే..



కాంగ్రెసోళ్లు చెప్పేవని వట్టి సొల్లు మాటలుగానే ఉన్నాయి. 55ఏండ్లపాటు అధికారంలో ఉన్నారు. రైతులకు చేసిన మేలు ఏమిటో మాకు తెలియదా? సాగునీళ్లు దేవుడెరుగు. కనీసం తాగనీకే మంచినీళ్లు కూడా ఇయ్యనీకె చేతగాలే. ఇప్పుడొచ్చి రైతులకు ఏదో చేస్తామని చెబితే నమ్ముతారా. తెలంగాణ రాష్ట్రం వొచ్చినంక సీఎం కేసీఆర్ సారు రైతుల కష్టాలు తీర్చిండు. ధరణి తీసుకువచ్చి భూ సమస్యలన్నింటినీ పరిష్కరించారు. ఎప్పటి నుంచో పట్టా కానీ నా భూమికి ధరణి వచ్చిన తర్వాత పాస్ పుస్తకం వచ్చింది. అంతా మంచిగున్నది అనుకునేలోపే కాంగ్రెసోళ్లు మల్లా వ్యవసాయాన్ని ఆగం చేసే కుట్ర చేస్తున్నరు. అప్పట్లా కరెంటు ఎప్పుడొస్తదా అని రాత్రంతా పొలాల వద్దే పడిగాపులు కాసేటోళ్లం. ఇయ్యాలా 24గంటల కరెంటుతో ఇంటి వద్ద హాయిగా నిద్రపోతున్నాం. రైతుకు కరెంటు, నీళ్లు, ఎరువులు ఇచ్చి పండించిన పంటను కూడా సమయానికి కొంటున్నరు. సీదా అకౌంటులోనే డబ్బులు పడుతున్నయి. ఇంత మంచిగున్న వ్యవసాయాన్ని మూడు గంటల కరెంటు చేస్తాం, పెద్ద మోటర్లు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి మతిలేని మాటలు మాట్లాడుతున్నడు. కలలో కూడా కాంగ్రెస్ రావొద్దు. మళ్లీ ఆ బాధలు అనుభవించొద్దు. రైతులంతా కేసీఆర్ సారుకు అండగా నిలిచి గెలిపించుకుందాం.

**- నీరటి శ్రీను, రైతు, నందారం, బాలానగర్ మండలం**

## పటేల్, పట్వారీలు కిరికిరిపెట్టేటోళ్లు..



రైతుల కష్టాలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిండు. మా భూములన్నింటికీ భద్రత తెచ్చారు. గత ప్రభుత్వాల హయాంలో రైతుల భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల కోసం రోజులు, నెలల తరబడి తిరిగినా పనులు అయ్యేవికావు. నేడు రిజిస్ట్రేషన్‌కు ఇలా వెళ్లి అలా వచ్చేస్తున్నాం. వారంలోగా పాస్‌బుక్కు నేరుగా ఇంటికే వచ్చేస్తుంది. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన పని లేదు. గతంలా పటేల్, పట్వారీలు గ్రామాల్లోని రైతుల భూములను ఒకరి పేరువి మరొకరికి చేసి కిరికిరిపెట్టేటోళ్లు. నేడు ధరణి తీసుకురావడం వల్ల అలాంటి పంచాయితీలన్నీ బంద్ అయినవి. దళారుల బెడద కూడా పూర్తిగా తప్పింది.ఇంత మంచి పథకాన్ని కాంగ్రెస్ వాళ్లు బంగాళాఖాతంలో వేయాలని మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనం. ధరణితోనే రైతులకు లాభం. అందుకే ధరణిని కొనసాగించడానికి సీఎం కేసీఆర్ సారే మళ్లీ రావాలి.

**- మారపల్లి వెంకటేశ్, రైతు, రాంరెడ్డిపల్లి, ఊర్కొండ మండలం**

## కాంగ్రెసొస్తే కరెంట్ కష్టాలు తప్పవు..



కరెంటు కష్టాలతో 55 ఏండ్లు ఎన్నో బాధలు పడ్డాం. సాగు చేసుకోవడానికి భూములున్నా కరెంటు, సాగునీరు లేక బీడుగా ఉండేవి. సీఎం కేసీఆర్ సారు వొచ్చినంక 24గంటల కరెంటుతో రెండు పంటలు పండించుకుంటున్నాం. ఇప్పుడొచ్చిన కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి కరెంట్ మూడు గంటలే సాలు అంటున్నరు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకొంటే సరిపోతుందని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ఇలాంటి వారికి అధికారమిస్తే రాష్ట్రాన్ని ఆగం చేస్తరు. వ్యవసాయం గురించి, రైతుల బాధల గురించి తెలిసిన సీఎం కేసీఆర్ సార్‌కే మా మద్దతు తెలుపుతాం. రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా పథకాల తోపాటు24 గంటల కరెంట్ ఇచ్చి అండగా నిలుస్తున్నరు.

**- ముచ్చర్ల ధర్మేందర్‌రెడ్డి, రైతు, ముచ్చర్లపల్లి, ఊర్కొండ మండలం**

## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### మళ్లీ మొదటికొస్తది..



తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ ధరణి తీసుకొచ్చి శానా మేలు చేసిండు. రైతులు భూములు అమ్మాలన్నా, కొనాలన్నా ఒక్క రోజులో పనైపోతుంది. దీంతో రైతులకు సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతున్నయి. గతంలో భూములు కొంటే నియోజకవర్గ కేంద్రంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి పని చేసుకోవాల్సి వచ్చేది. అక్కడ దళారుల తోనే పనయ్యేది. దీంతో రిజిస్ట్రేషన్ ఖర్చుకు మూడింతలు వెచ్చించాల్సి వచ్చేది. ఎందుకంటే రిజిస్ట్రేషన్‌కు ఇరువురికి చెందిన వ్యక్తులు వస్తరు. వారి చార్జీలు, భోజనాలు ఇతర ఖర్చులన్నీ కలిసి మోపెడయ్యేవి. సీఎం కేసీఆర్ ధరణి తెచ్చినంక మండల రెవెన్యూ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నరు. దీంతో రైతులకు శానా బాధలు తప్పినయ్. దళారీల పని కూడా పడదు. రిజిస్ట్రేషన్ అయినెంటనే వారి పేరుమీద భూమి ఆన్‌లైన్ అయితది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తమని చెప్తున్నరు. ఆ మాట ఇనంగనే పాత రోజులు గుర్తొస్తున్నయ్. ఎందుకంటే రిజిస్ట్రేషన్ అయ్యాక కూడా రికార్డుల్లో భూమి తన పేర నమోదు చేయనీకె ఏండ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగేది. ఎన్నికల్లో మేమంతా ఏకమై కాంగ్రెస్‌ను పాతరేసి కేసీఆర్‌కే మద్దతిస్తాం.

**- బోయ పెద్ద మల్లన్న, రైతు, మల్దకల్**

### మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు..



కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ పోతే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. కరెంటు ఉంటేనే ఆశ్చర్యపోవాలి. ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వకుండె. రాత్రి, పగలు తేడా లేకుండా రైతులంతా సేన్ల కాడ ఉండేడిది. కరెంట్ పోయి వస్తుంటే తడిచిన పొలమే తడిచేది. 3గంటల కరెంటు చాలు, పంటలు పండుతయని కాంగ్రెసోల్లు అంటున్నరు. ఇంతకు వారు వ్యవసాయం చేసిండ్రా అనే అనుమానమైతుంది. గతంలో కరెంట్ సరిగా ఇయ్యక పంటలు ఎండిపోయి రైతులు నష్టాల పాలైండ్రు. పంట పెట్టుబడి కన్నా కరెంటు బిల్లులు, మోటర్ల రిపేర్లే ఎక్కువయ్యేటివి. మోటర్లు అందరూ ఒకేసారి వేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. అవి రిపేర్ చేసి పెట్టనిక్కె మస్తు టైం పట్టేది. ఇలా పంటలు పండక రైతులు పట్నం బాటపట్టిన సందర్భాలున్నాయి. తెలంగాణవచ్చాక 24గంటల కరెంటు ఇస్తున్నరు. ఎప్పుడు అవసరమైతే అప్పుడెళ్లి మోటర్లు ఆన్ చేసి పంటలు పండించుకుంటున్నరు. తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా సాగునీరు అందిస్తుండడంతో వలసెళ్లిన రైతులు మల్ల సొంతూళ్లకొచ్చి పంటలు చేసుకుంటున్నరు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే మల్ల కరెంటు కష్టాలు తప్పవు.

**- రాఘవరెడ్డి, రైతు, మానవపాడు**

### ధరణిని తీసేస్తే దళారులు పుట్టుకొస్తరు..



సీఎం కేసీఆర్ రైతుల కోసం ధరణి ఫోర్టల్ తీసుకొచ్చి భూములకు భద్రత కల్పిస్తున్నరు. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తామంటున్నది. ధరణి తీసేస్తే రైతులు ఆగమాగం కావడం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థలో దొంగ రిజిస్ట్రేషన్లు చేసిండ్రు. రెవెన్యూ రికార్డులు గోల్‌మాల్ చేసి రికార్డులు మాయం చేసి సామన్య రైతులను మోసం చేసిండ్రురు. ప్రస్తుతం ధరణితో పట్టా పాసుపుస్తకం అరచేతిలో భూమి వివరాలు ఎప్పటి కప్పుడు తెలుసుకుంటున్నాం. కేసీఆర్ సారు చేసిన గొప్ప పనులు గతంలా ఏ నాయకుడు చేయలే. అనాలోచితంగా కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయం. రైతులు ఆలోచించి మేలు చేసే వారికి అండగా నిలవాలి.

**- రాంరెడ్డి, రైతు, వెన్నాచేడ్**